క్లుప్తంగా

కుక్కలకు వ్యాక్సినేషన్

పెనుగంచిప్రోలు: మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో బుధవారం వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ నిర్వహించారు. గ్రామంలో కుక్కల దాడిలో బాలుడు మృతిచెందిన నేపథ్యంలో సర్పంచ్ వేల్పుల పద్మకుమారి ఆధ్వర్యంలో వ్యాక్సినేషన్ చేపట్టారు. కుక్కలను పట్టుకుని స్థానిక పశువైద్యశాలలో పశు వైద్యాధికారి పి.అనిల్‌తో వ్యాక్సిన్లు చేయించారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి కె.శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

గొలుసు దుకాణాలపై ఆకస్మిక దాడులు



సాక్షి ఎఫెక్ట్

కంచికచర్ల: నియోజకవర్గంలో ఎక్కడబడితే అక్కడ మద్యం గొలుసు దుకాణాలు వెలిశాయి. ఈ దుకాణాల వద్ద మందుబాబులు అధిక ధరలు చెల్లించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 'పుట్టగొడుగుల్లా గొలుసు దుకాణాలు' శీర్షికన 'సాక్షి'లో బుధవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండలంలోని పరిటాల, గండేపల్లిలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ఇద్దరిని పట్టుకున్నామని, వారిపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ సీఐ బేగం తెలిపారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్‌ఐ గాలీసాహెబ్, హెడ్‌కానిస్టేబుళ్ల ఆనంద్, ఆర్.శ్రీనివాసబాబు తదితరులు పాల్గొన్నారు.

భూముల కోత.. రైతుల వ్యథ



పెనుగంచిప్రోలు వద్ద కోతకు గురైన మామిడి తోటలు



మునేరు వరదకు కోతకు గురైన భూములు చూపిస్తున్న రైతు

- మునేరు వరదకు కోతకు గురైన పొలాలు, తోటలు
- భారీగా నష్టపోయిన రైతులు
- భూములను బాగుచేసుకోలేక ఇబ్బందులు
- ప్రభుత్వం నుంచి రైతులకు అందని పరిహారం

పెనుగంచిప్రోలు: పచ్చని పంటచేలు, కళకళలాడిన తోటలు కనుమరుగయ్యాయి. సెప్టెంబర్ నెలలో మునేరు వరదలకు మామిడి తోటలు, మాగాణి పొలాలు భారీగా కోతకు గురయ్యాయి. కొన్ని తోటలు, పొలాలు పూర్తిగా కోతకుగురై మునేరులో కలిసిపోయాయి. మునేరు పక్కన ఉన్న మామిడి తోటలు నామరూపాలు లేకుండా పోయాయి. ఎన్నో ఏళ్లుగా పెంచిన మామిడి చెట్లు నీటి ప్రవాహానికి కొట్టుకుపోవటంతో పాటు పది నుంచి 20 అడుగుల పైన భూములు వందల మీటర్ల మేర కోతకు గురయ్యాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వరదలకు భారీగా కోతకు గురైన భూములను బాగు చేసుకోవాలంటే రైతులకు తలకు మించిన భారంగా మారింది. ముఖ్యంగా వత్సవాయి మండలంలోని ఆళ్లూరుపాడు, వేమవరం, పెనుగంచిప్రోలు మండలంలో పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, గుమ్మడిదుర్రు తదితర గ్రామాల్లో మామిడి తోటలు కోతకు గురయ్యాయి. వరదలకు 15 హెక్టార్లలో మామిడి తోటలు, 87.5 హెక్టార్ల విస్తీర్ణంలో పంటపొలాలు కోతకు గురయ్యాయి.

తలకు మించిన భారం

కోతకు గురైన భూములను బాగు చేసుకోవాలంటే రైతులకు తలకు మించిన భారంగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మునేరుకు వరదలు రావటంతో తోటలు మొత్తం కోతకు గురై మునేరులో కలిసి పోయాయి. పొలాలు బాగు చేసుకోవాలంటే రూ.లక్షలు ఖర్చు చేయాలని రైతులు వాపోతున్నారు. అంత ఆర్థిక స్తోమతు తమకు లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పెట్టుబడి పెట్టాలంటే కష్టం



వరదలకు మునేరు పక్కన ఉన్న మామిడి తోటలు భారీగా కోతకు గురయ్యాయి. వాటిని బాగు చేసి రక్షణ చర్యలు తీసుకోవాలంటే రూ.లక్షలు ఖర్చు చేయాల్సి ఉంది. అసలే మామిడి తోటలు సాగు చేస్తూ ఏటా నష్టాలను చవిచూస్తున్నాం. ఇప్పుడు కోతకు గురైన తోటలను బాగుచేసి, మళ్లీ మొక్కలు నాటేందుకు పెట్టుబడి పెట్టాలంటే కష్టంగా ఉంది.

– దివ్వెల నారాయణరావు, రైతు, పెనుగంచిప్రోలు

వరదలు ముంచేశాయి



గత ఏడాది వచ్చిన వరదలకన్నా ఈ ఏడాది మునేరుకు భారీగా వరదలు వచ్చాయి. నీరు ఉధృతంగా ప్రవహించడంతో మూడు ఎకరాల మాగాణి భూమి కోతకు గురైంది. పొలం అంతా ఇసుక మేట వేసింది. భూమి బాగు చేసి తిరిగి సాగులోకి తేవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. ప్రభుత్వం భూముల కోతలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

– ఉండెమొదలు సైదేశ్వరరావు, రైతు, అనిగండ్లపాడు

నిబంధనలు పాటించకుంటే చర్యలు

నందిగామ టౌన్: వాహనదారులు నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపాలని ఎస్‌ఐ అభిమన్యు సూచించారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏసీపీ తిలక్ ఆదేశాల మేరకు పట్టణంలోని చందాపురం ఫ్లై ఓవర్ వద్ద బుధవారం ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ అభిమన్యు మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, మద్యం తాగి, ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపితే సహించేది లేదని హెచ్చరించారు. ఆటోవాలాలు సైతం పరిమితి మేరకు మాత్రమే ప్రయాణికులను ఎక్కించాలని సూచించారు. స్కూల్ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు ఉంచాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి



మల్కాపురంలో మురుగును పరిశీలిస్తున్న ఎంపీడీఓ నితిన్

జగ్గయ్యపేట: గ్రామాల్లో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీడీఓ నితిన్ పేర్కొన్నారు. మండలంలోని గండ్రాయి, మల్కాపురం గ్రామాల్లో ఆయన బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మల్కాపురం ఎస్సీ కాలనీలో డ్రెయిన్లు లేకపోవటంతో మురుగు నీరు రోడ్లపై చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. సచివాలయ సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. సర్వేలను నిష్పక్షపాతంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు కీర్తన్ ఎంపిక



నందిగామ టౌన్: తమ విద్యార్థి రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం గర్వంగా ఉందని కాకతీయ విద్యా సంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్ పేర్కొన్నారు. 68వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థి కీర్తన్‌ను స్థానిక పాఠశాల ఆవరణలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో అండర్–14 విభాగంలో కీర్తన్ మూడు బంగారు పతకాలు సాధించాడని పేర్కొన్నారు. 100, 50 మీటర్ల బ్యాక్ స్ట్రోక్, 50 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగాల్లో పతకాలు సాధించాడని వివరించారు. ఈ నెల 23 నుంచి 30 వరకు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీలకు కీర్తన్ ఎంపికయ్యాడని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ప్రతినిధులు కాపా భారతి, కార్తికేయ, సుష్మ, ప్రిన్సిపాల్ సత్యమూర్తి, కోచ్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

జగ్గయ్యపేట అర్బన్: మండలంలోని చిల్లకల్లు, బలుసుపాడు సబ్‌స్టేషన్లలో నూతనంగా 11 కేవీ బ్రేకర్లు ఏర్పాటు చేస్తున్నందున గురువారం పలు గ్రామాలు, జగ్గయ్యపేట పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు జె.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. ఉదయం 11 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. చిల్లకల్లు సబ్‌స్టేషన్ పరిధిలోని చిల్లకల్లు, ధర్మవరప్పాడు తండా, తిరుమలగిరి, ఆటోనగర్ పారిశ్రామిక ప్రాంతం, పేట పట్టణంలోని శివాలయం ప్రాంతం, మిట్టగూడెం, నాగమయ్యబజారు, విలియంపేట, అద్దాలబజారు, రంగస్వామిబజారు, పెద్ద రామాలయం బజారులో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో గురువారం ఉదయం 9.30 గంటలకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ కార్యక్రమం జరుగుతుందని గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ బుధవారం తెలిపారు. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర అతిథులుగా పాల్గొని వారోత్సవాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలు ఈ నెల 20వ తేదీ వరకు జరుగుతాయని వివరించారు. ఈ వారోత్సవాల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. తొలి రోజు శతక పద్యాల పోటీ, 15న పుస్తక ప్రదర్శన, 16న గన్నీబ్యాగ్ పోటీలు, 17న వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, 18న చిత్రలేఖనం, 19న ముగ్గుల పోటీలు, 20న ముగింపు సమావేశం, విజేతలకు బహుమతి ప్రదాన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. రోజూ సాయంత్రం 5.30 గంటలకు సాహిత్య కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదయ్యా..



నందిగామ టౌన్: వయసు ఉడిగిపోయిన తనను కుటుంబ సభ్యులు తనను పట్టించుకోవటం లేదని ఓ వృద్ధురాలు వాపోయింది. ఏసీపీ తిలక్ ఎదుట బుధవారం తన గోడువెల్లబోసుకుంది. వత్సవాయి మండలం గోపినేనిపాలెం గ్రామానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీనరసమ్మ బుధవారం నందిగామలోని ఏసీపీ కార్యాలయానికి వచ్చారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధురాలు వచ్చిందని సిబ్బంది ద్వారా తెలుసుకున్న ఏసీపీ స్వయంగా ఆటోలో ఉన్న ఆమె వద్దకు వెళ్లారు. తనను కుటుంబ సభ్యులు పట్టించుకోవడం లేదని, వారితో ఇబ్బందులు ఉన్నాయని ఏసీపీకి వృద్ధురాలు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏసీపీ, వృద్ధురాలి పూర్తి వివరాలు తెలుసుకుని ఆమె సమస్య పరిష్కరించాలని వత్సవాయి ఎస్‌ఐను ఆదేశించారు. వృద్ధురాలి సమస్యను ఆలకించి, ఆమె ఆటో చార్జీలను కూడా ఏసీపీ అందజేశారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు



కంచికచర్ల: క్షీరాబ్ది ద్వాదశి సందర్భంగా మండలంలోని గొట్టుముక్కల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత వసంత వేణుగోపాలస్వామికి బుధవారం భక్తులు పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు కేశావాచార్యులు స్వామి వార్లకు తులసి దళాలతో శత సహస్రనామ పూజలు జరిపారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభమైన పూజలు సాయంత్రం వరకు నిర్విరామంగా కొనసాగాయి.

నేటి నుంచి శిక్షణ తరగతులు

కంచికచర్ల: గ్రామాభివృద్ధి ప్రణాళిక తయారీ శిక్షణ తరగతులు గురు, శుక్రవారాల్లో జరుగుతాయని ఈఓపీఆర్డీ బొజ్జగాని శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ తరగలులు జరుగుతాయని పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం బుధ, గురువారాల్లో తరగతులు జరగాల్సి ఉందని పేర్కొన్నారు. గురు, శుక్రవారాల్లో జరుగుతాయని వివరించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం పది నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, జెడ్పీటీసీ సభ్యులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, వీఏలు హాజరుకావాలని సూచించారు.

సాగు నీటి సంఘ ఎన్నికలు వాయిదా

జగ్గయ్యపేట: ఈ నెల 21 నుంచి 29 వరకు జరగాల్సిన సాగునీటి ఎన్నికలను ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసిందని జగ్గయ్యపేట ఎన్ఎస్‌పీ డీఈ అండ్ ఎంఈఈ సంతోష్ రాథోడ్ బుధవారం తెలిపారు. తదుపరి తేదీలను ప్రభుత్వం ప్రకటిస్తుందని పేర్కొన్నారు. రైతులు గమనించాలని కోరారు.

ఆగివున్న ట్రాలీ ఆటోను ఢీకొన్న బస్సు

కంచికచర్ల: రోడ్డు పక్కన ఆగివున్న ట్రాలీ ఆటోను వెనుక నుంచి వచ్చిన బస్సు ఢీకొంది. మండలంలోని పరిటాల నేషనల్ హైవేపై బుధవారం జరిగిన ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ఎస్‌ఐ బి.రాజు కథనం మేరకు.. పరిటాల నేషనల్ హైవే పక్కన ఓ ట్రాలీ ఆటో ఆగివుంది. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ప్రైవేటు బస్సు ఆ ఆటోను వెనుక నుంచి ఢీకొంది. ప్రమాదం ధాటికి ట్రాలీ ఆటో పల్టీకొట్టింది. బస్సు ముందు భాగం దెబ్బతింది. ఈ ఘటనలో చల్లపల్లి మండలం, నడకుదురు గ్రామానికి చెందిన జంపాన మారయ్య బస్సు డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 23 ప్రయాణికులు ఉన్నారు. వారు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డ్రైవర్ మారయ్యను టోల్‌ప్లాజా హైవే అంబులెన్స్ వాహనంలోకి ఎక్కించి నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జగ్గయ్యపేటలో వాహనాల తనిఖీ

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలో పోలీసులు బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో సీఐ పోలాకి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బందితో కలిసి పలు వాహనాలను తనిఖీ చేపట్టి డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలను నడిపితే కేసులు రాస్తామని హెచ్చరించారు. తల్లిదండ్రులు మైనర్లకు బైకులను ఇవ్వరాదని సూచించారు. పట్టణ ఎస్‌ఐ జి.రాజు, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గ్రామసభ

కంభంపాడు(వత్సవాయి): కంభంపాడు శివారు రెబ్బవరం పరిధిలో భూముల రీ సర్వే జరిగిన నేపథ్యంలో గురువారం గ్రామసభ నిర్వహిస్తామని తహసీల్దార్ ఎస్.నరసింహారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం పది గంటలకు సచివాలయంలో గ్రామ సభ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. రీ సర్వేలో భూముల విస్తీర్ణంలో తేడాలు, ఖాతా నంబర్ల నమోదులో తప్పులు వంటివి ఉంటే రైతులు గ్రామసభలో అర్జీలు ఇవ్వొచ్చని సూచించారు. అర్జీలను పరిశీలించి భూ సమస్యలకు పరిష్కారం చూపిస్తామని తెలిపారు.